తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## వైభవంగా త్రిశూల స్నానం, పోటెత్తిన భక్తజనం



చంద్రగిరి, నవంబర్ 10 ప్రభాతవార్త: స్వర్ణముఖీ నదీతీరాన వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామి వారి కార్తీక మాస ముక్కోటి మహోత్సవాలు సోమవారం త్రిశూల స్నానంతో వైభవంగా ముగిశాయి. వేకువజామున అగస్త్యేశ్వర స్వామి, ఆనందవల్లీ అమ్మవారికి అభిషేకాధులు నిర్వహించి, విశేష అలంకరణలు గావించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆవరణలోని పుష్కరిణీలో అర్చకులు త్రిశూలస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పుష్కర స్నానానికి పోటీపడ్డారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ఆవరణలో ధ్వజఅవరోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఉత్సవాల సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

### - స్వల్ప గాయాలతో బయటపడిన అయ్యప్ప స్వాములు



కల్లూరు, నవంబర్ 10, ప్రభాతవార్త

పులిచెర్ల మండలం కల్లూరు హెచ్.పి. పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం ఉదయం దుకాణంలోకి కారు దూసుకువెళ్లడంతో అయ్యప్ప స్వామి భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తెలంగాణకు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు అరుణాచలం వెళుతున్న సమయంలో కల్లూరు వద్ద డ్రైవర్ నిద్ర మత్తులో కారు దుకాణంలోకి దూసుకువెళ్ళింది. కారు ముందు భాగం ధ్వంసం కావడంతో భక్తులకు పెద్ద ప్రమాదం జరిగి ఉంటుందని భావించిన స్థానికులు కారు వద్దకు వెళ్లి అయ్యప్ప స్వాములను రక్షించారు. కల్లూరు పోలీసులు సంఘటన స్థలానికి. చేరుకుని భక్తుల వివరాలు సేకరించారు. గాయపడిన భక్తులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# హై అలర్ట్!

## జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం



తిరుపతి,నవంబర్ 10(ప్రభాతవార్త):

దేశరాజధాని ఢిల్లీనగరంలో సోమవారం సాయంత్రం బాంబులు పేలడంతో పుణ్యక్షేత్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో రాష్ట్ర హోంశాఖ ఉన్నతాధికారులు తిరుపతి జిల్లా పోలీసులను అప్రమత్తం చేసింది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆగమేఘాలపై తిరుమల, తిరుపతితోబాటు శ్రీకాళహస్తి క్షేత్రాల్లో పోలీస్ అధికారులను, ఏఆర్ బలగాలను, ఆక్టోపస్ దళాలను రంగంలోకి దింపారు. తిరుమల ఆలయం పరిసరాల్లో మరింత నిఘా పెంచారు. తిరుమలకు వచ్చే అలిపిరి టోల్‌గేట్,కొండపై జిఎన్‌సి టోల్‌గేట్‌లో ఆక్టోపస్ దళాలు పహరాకాస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. తిరుమల తిరుపతి నగరం ప్రాముఖ్యతతో 24గంటలూ పోలీసు విభాగం అప్రమత్తం గా వ్యవహరిస్తూ ఉంది. నగరం శివార్లలో, ప్రధాన వాణిజ్యసంస్థలు, హోటళ్ళు, లాడ్జీలు, స్టార్ హోటళ్ళు, నగరానికి ప్రధాన ప్రవేశ కూడళ్ళు, నగరం అంతా అత్యాధునిక నిఘానేత్రాలు డేగకళ్లతో పహారాకాస్తున్నాయి. కేంద్రహోంశాఖ ఆదేశాలతో మరింతగా అలర్ట్ అయ్యారు. తిరుపతికి వచ్చే అన్ని మార్గాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారణ చేస్తున్నారు.

### రేణిగుంట రైల్వేస్టేషన్‌లో పోలీస్‌ల మోహరింపు



రేణిగుంట నవంబర్ 10 ప్రభాతవార్త.

ఢిల్లీ ఎర్రకోట వద్ద కారు లో పేలుడు దృష్ట్యా శ్రీవారి ముఖద్వారమైన రేణిగుంటలో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సోమవారం రాత్రి రైల్వే స్టేషన్ వద్ద భారీ సంఖ్యలో పోలీసు బలగాలు మోహరింపజేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సిఐ జయచంద్ర ఆధ్వర్యంలో జిఆర్పి సిఐ ఎతేంద్ర, ఆర్పిఎఫ్ ఎస్సై సందీప్ , తమ బలగాలతో రేణిగుంట రైల్వే స్టేషన్ వద్ద మోహరించారు. అన్ని ప్లాట్ ఫారం లు, వెయిటింగ్ రూములు, ప్రయాణికుల బ్యాగులతో పాటు, వివిధ రైళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానస్తులను ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐ జయచంద్ర వార్త ప్రతినిధితో మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# కొత్తపేటలో దారుణం

## పట్టపగలు బంగారు నగల దోపిడీలో వృద్ధురాలు మృతి మరొకరికి గాయాలు




కల్లూరు, నవంబర్ 10, ప్రభాతవార్త

పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి (కొత్తపేట)లో సోమవారం మధ్యాహ్నం దారుణం చోటుచేసుకుంది. బంగారు నగలు దోపిడీలో వృద్ధురాలు మృతి చెందగా, మరో వృద్ధురాలుకు గాయాలయ్యాయి. గ్రామస్తులు పోలీసుల కథనం మేరకు. కొత్తపేటలో దామలచెరువు మార్గంలో కళావతమ్మ నివసిస్తున్నది. ఈ గృహంలో పై భాగంలో విమలమ్మ (75) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నది. సోమవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో విమలమ్మ కింద కాపురం ఉంటున్న కళావతమ్మ ఇంటికి వచ్చి కబుర్లు చెప్పుకుంటున్నారు. బయటకు వెళ్లిన విమలమ్మ కుటుంబ సభ్యులు రెండు గంటల తర్వాత తిరిగి ఇంటికి రావడం ఇంటిలో విమలమ్మ లేకపోవడంతో కింద కళావతమ్మ ఇంటికి రాగా తలుపు వేసి ఉండడం జరిగింది. కుటుంబ సభ్యులు తలుపు తీసి చూడగా విమలమ్మ కింద పడిపోయి ఉండడం, కళావతి చెవులు నుంచి రక్తం కారుతూ ఉండడంతో అది చూసి వారు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని విమలమ్మ మృతి చెందినట్లు గుర్తించారు. కళావతమ్మ భయంతో వణికిపోతూ ఉండడం విషయాలు చెప్పలేకపోయింది. అయితే విమలమ్మ, కళావతమ్మ దగ్గర ఉన్న బంగారు నగలు కనబడకపోవడం గుర్తించిన కుటుంబ సభ్యులు గుర్తు తెలియని వ్యక్తులు నగలు కోసం దారుణానికి పాల్పడినట్లు గుర్తించి కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కల్లూరు సిఐ జయరామయ్య, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన కళావతమ్మను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు డిఎస్పి సాయినాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. నగల కోసమే గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిసింది. కొత్తపేటలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

# భక్తుల సమస్యలపై సభ్యుల మొర:శివరాత్రి ఆమోదాలకు అధికారుల అజెండా




మొదటి సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ, .పాల్గొన్న ధర్మకర్తల మండలి సభ్యులు

శ్రీకాళహస్తి,నవంబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి మొదటి సమావేశంలో పలువురు సభ్యులు మొరబెట్టుకున్నారు. అయితే అధికారులు ఎంతో చక్కగా రాబోవు శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అజెండాను రూపొందించి ధర్మకర్తల మండలి సమావేశంలో ఆమోదానికి పొందుపరచారు. అధికారులు 11 అంశాలతో మొదటి సమావేశం అజెండాను పొందుపరచారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన సమావేశం సోమవారం మధ్యాహ్నం సమావేశ హాలులో ఏర్పాటు చేసారు. సమావేశానికి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ అధ్యక్షత వహించగా పాలకమండలి సభ్యులు హాజరయ్యారు.సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు పలు సమస్యలపై చర్చించినట్లు సమాచారం. ఇందులో ముఖ్యంగా గాదిపాకుల గోపి మాట్లాడుతూ ఆలయంలో దర్శనాల తీరు అస్తవ్యస్తంగా ఉందన్నారు. కొందరు పోతే బార్లుగా తెరచుకుంటున్న గేట్లు మరి కొందరు పోతే ఎందుకో నిబంధనల గురించి చెబుతున్నాయని సమావేశం దృష్టికి తెచ్చినట్లు తెలి సింది.ఆలయంలో దళారుల బాధ ఎంతో ఉందని వాపోయారు. ఆలయంలో ఎందుకు ఈ తారతమ్యబేధాలంటూ వాపోయారు.దళారి వ్యవస్థపై స్పందించలేమా? కట్టడి చేయలేమా? అంటూ చర్చించినట్లు తెలిసింది. కాగా వాకచర్ల గుర్రప్పశెట్టి పరమ పవిత్రమైన ఆలయానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తున్నారు. తిరుమల తరహాలో వచ్చి న ప్రతి భక్తునికి ఉచితంగా లడ్డు వడ అందించాలని సూచించారు. కాగా పగడాల మురళి పలు సమస్యలను సమావేశంలో చర్చించు టకు ప్రయత్నించినట్లు సమాచారం. భక్తులు దళారుల వలలో పడి దోపిడికి గురౌతున్నట్లు సమావేశంలో ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. కాగా కార్‌పార్కింగ్ సమస్యను సమావేశంలో మురళి చర్చించారు. మాస్టర్ ప్లాన్ ఎప్పటికి అచరిస్తారని ప్రశ్నించారు. భక్తుల బాధలను పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయని,అధికారులచర్యలేమిటని ప్రశ్నించినట్లు తెలిసింది.

### సమావేశంలో నిర్ణయాలు ఇవే:

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యద్భుతంగా నిర్వహించుటకు సొమ్ములు కేటాయింపు, వయో వృద్ధులు చంటి బిడ్డలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు. పాలు,మజ్జిగల పంపిణి, ఆలయం అంతా సెంట్రల్ ఏసి, రాబోవు రోజుల్లో అంతా డిజిటల్‌పేమెంట్, సేవా టిక్కెట్లు కౌంటర్లనీ బయట రెండవ గేటు సమీపంలో, -భరద్వాజతీర్థంలో సెంట్రల్ పార్కింగ్, మాస్టర్‌ప్లాన్ అమలుకు సత్వరచర్యలు,-అజెండాలో 11 అంశాలను మహాశివరాత్రి బడ్జెట్‌ను ఆమోదం. ఈ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఇఇ డి.బాపిరెడ్డి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు సమాధానం చెప్పారు.సమావేశంలో ఎంఎఎ సుధీర్‌రెడ్డి, చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్, సభ్యులు పగడాలమురళి, గోపినాథ్,గుర్రప్పశెట్టి, లక్ష్మీనారాయణ, కె.నాగరాజు. రాఘవయ్య,కోలా విశాలి,హేమావతి, రజని,స్రవంతి, కుమారి, సావిత్రి,కౌసల్య,విజయమ్మ, డి.లక్ష్మమ్మ,ప్రత్యేకాహ్వానితులు వెంకటరామ్,చాగంటి శైలజలు హాజరయ్యారు. మొదటి సమావేశానికి తెలంగాణాకు చెందిన ప్రకాష్‌రెడ్డి హాజరు కాలేదు. ఆయన ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు.

## 20, 21న రాష్ట్రపతి తిరుపతి, తిరుమల పర్యటన



తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 10 ప్రభాతవార్త :

ఈ నెల 20, 21న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుపతి జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటనలో చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వరాదని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సంయుక్తంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు రాష్ట్రపతి తిరుపతి తిరుమల పర్యటన సందర్భంగా సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, ఎస్.పి సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ నెల 20న మధ్యాహ్నం 3.25 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గాన 3.35 గం.లకు బయలుదేరి 3.55 గం.లకు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం 4.30 గంలకు బయలుదేరి 5.20 గం.లకు తిరుమల శ్రీ పద్మావతి అతిథి గృహానికి చేరుకుని రాత్రికి బస చేయనున్నారని తెలిపారు. మరుసటి రోజు 21వ తేదీ ఉదయం 9.20 గంటలకు శ్రీ వరాహ స్వామిని దర్శించుకుంటారని, అనంతరం 10 గం.లకు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారన్నారు. అనంతరం తిరుమల నుండి బయలుదేరి 11.50 గంటలకు తిరుపతి విమాశ్రయం చేరుకుని హైదరాబాద్ తిరుగు ప్రయాణం కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, అదనపు ఎస్పీ రవి మనోహరా చారి, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, తిరుపతి , శ్రీకాళహస్తి ఆర్ డి ఓ లు రామ్ మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, డి.ఎం.హెచ్, ఓ బాల కృష్ణ నాయక్, ఆర్ అండ్ బి ఎస్.సి రాజా నాయక్, డి.పి.ఓ సుశీల దేవి, డి.ఆర్.డి. ఏ పి.డి శోభన్ బాబు, ఇతర జిల్లా అధికారులు, ఎయిర్పోర్ట్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, టిటిడి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరినీ కస్టడీకి ఇవ్వండి!

### ఏసిబి కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు

### మూడురోజులు విచారణలో సంచలనం చేస్తారా?

తిరుమల, నవంబర్ 10 ప్రభాతవార్త :

తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో సూత్రధారుల హస్తం తేల్చాలంటే చిన్నఅప్పన్న, అజయ్‌కుమార్‌ను కస్టడీకి కోరుతూ సిట్ అధికారులు ఏసిబి కోర్టులోపిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. మూడురోజులుపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతున్న సిట్ అధికారులు విచారణలోనే సంచలనం సృష్టిస్తారా అనేది వినిపిస్తోంది. ఇప్పటికే కల్తీనెయ్యి వ్యవహారంలో 2022లో అప్పటి టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అక్రమాలు భారీగానే ఉన్నాయని సిబిఐ సిట్ అధికారులు రికార్డులను కోర్టుకు సమర్పించినట్లు తెలుస్తోంది. ఈ కీలకమైన సంచలన కేసులో వైవి సుబ్బారెడ్డి బ్యాంకు లావాదేవీలను కోరారు. మరింత కీలక సమాచారం రాబట్టేందుకు చిన్నఅప్పన్నను,అజయకుమార్‌ను కస్టడీకి తీసుకునేందుకు సిట్ అధికారులు నెల్లూరు ఏసిబి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేయడంతో కొత్త విషయాలు వెలుగుచూడనున్నాయి. బోలేబాబాడెయిరీతోబాటు ఏఆర్ డెయిరీ,వైష్ణవి డెయిరీ, ప్రీమియర్అగ్రిఫుడ్స్ తో ఒప్పందంతో భారీగా కమీషన్లు ముట్టాయనేది సిట్ వాదనలు. సిట్ సేకరించిన సమాచారంతో మరింత కీలకంగా ఆధారాలు రాబట్టేందుకు మాజీ ఛైర్మన్, రాజ్యసభసభ్యుడు వైవి సుబ్బారెడ్డికి నోటీసులు జారీచేసి విచారణ చేయనున్నారనేది స్పష్టమవుతోంది. కల్తీనెయ్యి పాపంలో అసలు సూత్రధారులు ఎవరున్నారనే విషయం ఇప్పుడు తేల్చేపనిలో నిమగ్నమైంది. ఈ వారంలో సిట్ దర్యాప్తు, ఎవరిని పిలిచి అరెస్ట్ చేయనుందనేది హాట్‌టాఫిక్‌గా మారింది.

## వైభవంగా కార్తీక బహుళ పంచమి దీపారాధన



కాణిపాకం, నవంబర్ 10 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో కార్తీక బహుళ పంచమి సోమవారం కార్తీక దీపారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. కార్తీకమాసం సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరాలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకింద మహిళలు సోమవారం రోజున ఉదయం నుండి రాత్రి వరకు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున దీపారాధన కోసం తరలిరావడంతో మణికంఠేశ్వరాలయం మహిళా భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో మూడు రోజుల పాటు జరగనున్న పవిత్రోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అలంకార మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు సాయంత్రం 5గంట లకు నిర్వహించిన అనుజ్ఞ, విఘ్నేశ్వర పూజ, వాస్తు శాంతి, పుణ్యాహావాచనం, మృత్సంగ్రహణం, రక్షాబంధనం, స్థండిల మండలేశ్వర పూజ, గంధపవిత్ర సమర్పణ విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, దీపారాధన, ప్రసాద వినియోగం వంటి పూజాధి కార్యక్రమాల నిర్వహించడం ద్వారా మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయం కిటకిట

### స్వామి బిల్వార్చన:అమ్మవారికి లక్ష కుంకుమార్చన



శ్రీకాళహస్తి,నవంబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక మాసం సందర్భంగా భక్తులతో కిట కిట లాడుతుంది. సోమవారం కడలి తరంగాల్లా మహిళా భక్తులు కదలి వచ్చారు. సోమవారం వేకువ జాము నుంచి ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. ఓ వైపు భక్తుల తాకిడి. రాహుకేతుదోష నివారణ పూజలకు రద్దీ. విఐపిల తాకిడి,సేవలతో పునీతం. కార్తీక మాసం సందర్భంగా ముక్కంటీశునికి లక్ష బిల్వార్చన, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం స్వామి అమ్మవార్లకు అలంకార మండపంలో ప్రత్యేకంగా నియమించిన వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఆలయ పౌరోహితులు అర్థగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా ఆలయ ప్రధాన అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామి నాధన్ అచ్చితా గురుకుల్, ఆలయ ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి అభిషేక గురుకుల్ సూరి వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా బిల్వాలను సమర్పిస్తూ పూజించారు. కాగా అమ్మవారికి ప్రత్యేకంగా రాజమండ్రి నుంచి అందించిన కుంకుమతో అభిషేకించారు.ఈ కార్యక్రమాలను ఆలయానికి వచ్చిన సామాన్యభక్తులు కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసారు.

# వేదాంతపురంలో దోబీఘూట్ల అమ్మకాలపై ఆందోళన



తిరుపతిరూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీలో దోబీ ఘాట్లను ప్లాట్స్ రూపంలో మార్చి విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 213, 230, 250, 251 సర్వేనెంబర్స్‌లో దోబీఘాట్లకు స్థలం కేటాయించారని, మరల 214 సర్వేనెంబర్‌లో కూడా స్థలం కేటాయించారని నకిలీ పత్రాలు సృష్టించి విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆయా దోబీ ఘాట్లలో ఇప్పటివరకు రజకులు బట్టలు ఉతకడం గాని, బట్టలు ఇస్త్రీ చేయడం గాని జరగలేదన్నారు. సర్వేనెంబర్ 214లో వున్న కాలువ స్థలాన్ని బి.విజయకుమార్ అనే వ్యక్తి స్థానిక వైసిపి నాయకులతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పరంధామ, శ్యాంబాబు,చంద్రముదిరాజ్, చిరంజీవిలు మాట్లాడుతూ వేదాంతపురం గ్రామ పంచాయతీలో ఓ పథకం ప్రకారం రజసంఘాలు బయట వ్యక్తుల్ని కొంతమందిని కలుపుకుని కమిటీలుగా ఏర్పాడి దోబీఘాట్లకు స్థలం మంజూరు చేయించుకుంటారని తెలిపారు. అనంతరం దోబీఘాట్లకు కేటాయించిన స్థలంలో నీటి సదుపాయం లేదని బయట వ్యక్తులను తప్పించేసి, ఆ స్థలాన్ని ప్లాట్స్‌గా మార్చి అమాయకులు విక్రయిస్తారని తెలిపారు. దోబీఘాట్ మంజూరై ఇప్పటి 15సంవత్సరాలు అయిందన్నారు. ప్రభుత్వ నిబంధల మేరకు దోబీఘాట్ల స్థలం 6సంవత్సరాలు ఖాళీగా నిరుపయోగంగా ఉంటే దోబీఘాట్లకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాల్సి ఉందన్నారు. వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 214లో అర్హులైన స్థానిక ప్రజలకు 15మందికి ఇంటిపట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ స్థలం దోబీఘాట్‌కు మంజూరైందని నకిలీపత్రాలు సృష్టించుకుని పేదలకు అడ్డు తగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రెవెన్యూ అధికారులు సర్వే చేయడంతో పాటు రికార్డ్స్‌లో కూడా లేదని తెలిందన్నారు. 214 సర్వేనెంబర్‌లో ప్లాట్స్ విక్రయించి సొమ్ము చేసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. పంచాయతీలో పేదలకు 2సెంట్లు లెక్కన ఇంటిస్థలం కేటాయించాలని కోరారు.



# సర్వసభ సమావేశంలో సమస్యలు వెల్లువ



వాకాడు, నవంబర్ 10 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయంలోని స్త్రీ శక్తి భవనంలో సోమవారం ఎంపీపీ అనసూయమ్మ అధ్యక్షతన ఎంపీడీవో సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని హౌసింగ్ బిల్లులు సకాలంలో రాలేదని, రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, యూరియా వలన రైతులకు ఇబ్బందులు పడుతున్నారని, అదేవిధంగా ఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా పనులు జరగడం లేదని నాయకులు సమస్యలు లేవదీశారు. ఎంపీడీవో సాయి ప్రసాద్ మాట్లాడుతూ తాను, తహసీల్దార్ నయాజ్ ఇక్బాల్లు ఇద్దరు కొత్తగా వచ్చామని తెలియజేశారు. సర్వసభ్య సమావేశంలో నాయకులు పలు సమస్యలు తీసుకురావడం జరిగిందని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ సహఫోరుడు కోడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, సముద్ర తీరాన నివసిస్తున్న బాధితులను వెంటనే ఆదుకోవాలని తెలిపారు. ఈ సాధారణ సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్ , ఎంపీపీ వైస్ పర్సన్, జడ్పీటీసీ సభ్యులు రామకృష్ణ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట రమణయ్య,నిర్మల, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచులు సిద్దారెడ్డి మధుసూదన్ రెడ్డి, నాగరాజు, కిషోర్ కుమార్, విజయ్ రెడ్డి, రమణమ్మ, ఎంఈఓ నసీం అలీ, పంచాయతీరాజ్ ఏఈ కిరణ్, అగ్రికల్చర్ ఆఫీసర్ సుమాంజలి, ఏపీవో విజయ, ఏపిఎం పోలమ్మ, ట్రాన్స్కో డిఈ విజయలక్ష్మి, సిడిపిఒ మునుకుమారి, హౌసింగ్ ఏఈ భాస్కర్, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ



డక్కిలి, నవంబరు 10 ప్రభాతవార్త: డక్కిలి మండలంలోని మార్గుంట, మోపూరు రోడ్డు గ్రామంలో సోమవారం తుఫాన్ బాధితులు సుమారు 150 మందికి నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డక్కిలి తహశీల్దారు మోపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంగా మార్గుంట, మోపూరురోడ్డు గ్రామాల్లోని చేనేత కార్మికులు పనులు కోల్పోయారని చెప్పారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, మాదాయపాళెం సొసైటీ అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్యనాయుడు మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ప్రభుత్వ అధికారులు,కూటమి నాయకులు అప్రమత్తంగా ఉండడం వల్ల నష్టాలు తగ్గాయని తెలియజేశారు. అంతేగాక ఎక్కడైనా నష్టపోయిన వారికి ప్రభుత్వం తగిన సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డక్కిలి టీడీపీ నాయకులు చంద్రారెడ్డి,పలువురు డీలర్లు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న రోడ్డులతో ప్రజలు అవస్థలు



డక్కిలి,నవంబరు 10 ప్రభాతవార్త: మండలంలోని పలు గ్రామాల లింకు రోడ్లులు మొంథ తుఫాన్ ప్రభావంగా దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డక్కిలి పంచాయతీలోని ఆల్తూరుపాడు నుంచి ఆల్తూరు పాడుకు వెళ్లే మార్గంలో కల్వర్టు భారీ వర్షాలకు కొట్టుకు పోవడంతో ఈమార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఇక మండలంలోని పాతనాలపాడు నుంచి పాతనాలపాడు అరుంధతీవాడకు వెళ్లే మార్గంలో వరద ఉధృతి కారణంగా మధ్యలో ఉన్న కాజివే కొట్టుకుపోయింది. అంతేగాక పలు గ్రామాల్లోని మట్టి రోడ్డులు గుంతలుమయంగా మారి రాకపోకలకు ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. మరో వైపు పలు గ్రామాల తారు రోడ్డులు దెబ్బతినన్నాయి. దెబ్బతిన్న రోడ్డులను త్వరితగతిన మరమ్మతులు చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి!



నాయుడుపేట, నవంబర్ 10 ప్రభాతవార్త: నాయుడుపేటలోని కెకెకల్యాణ మండపం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం మోటార్బైక్ను ఓ పరిశ్రమ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మోటార్బైక్, ఓ పరిశ్రమ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెళ్లకూరు మండలం అర్థమాల గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి మృతిచెందగా, చిలమత్తూరుకు చెందిన శ్రావణి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆ మహిళను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయండి



వెంకటగిరి, నవంబర్ 10 ప్రభాతవార్త: అర్హులైన పేదలకు పెన్షన్లు మంజూరు చేయాలని 14వ వార్డు కౌన్సిలర్, నియోజకవర్గ వై.యస్.ఆర్.సి.పి పార్టీ ఆర్.టి.ఐ విభాగపు అధ్యక్షుడు ఆరి శంకరయ్య తెలిపారు. బొగ్గుల మిట్ట ,నరసింహారావు విధి, ముత్యాలపాలెం, ధర్మపురం, కోర్టు సెంటరు వీధులలో గల పింఛన్ కొరకు అప్లికేషన్ పెట్టిన వారిని కలిసినట్లు చెప్పారు. 18 నెలల క్రితం పింఛన్కు దరఖాస్తు చేసుకొని అర్హత ఉండికూడా పింఛన్ అందక బాధపడుతున్నవారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. పట్టణ వాసులు తెలిపిన సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు.

## సూళ్లూరుపేటలో కార్తీక సోమవార పూజలు



సూళ్లూరుపేట, నవంబర్ 10 ప్రభాతవార్త: కార్తీక మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక అభయ శంకర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి దేవస్థానం అర్చకులు రమణయ్య పూజలు చేశారు. టిటిడి బోర్డు మాజీ సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి ఉభయకర్తగా స్వామివారికి అభిషేకాలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ నాగేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకారాలు, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించి శివ నామ స్మరణ చేశారు. దేవస్థానం ఛైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, అర్చకులు పేటేటి సునీల్కుమార్శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఇస్కాన్ సంస్థ నెల్లూరు వారిచే భజనలు, తులసీ పూజను, హారతులను నిర్వహించారు.

## ప్రశ్నిస్తే గొంతులు కోస్తారా : ఎంపి మద్దిల

వెంకటగిరి, నవంబర్ 10 ప్రభాతవార్త: ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం దారుణమని ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలం, ఎరుకల కులానికి చెందిన యువకుడు బడనపురి గోపాల్పై జరిగిన భౌతిక దాడి దారుణమని చెప్పారు. దాడికి పాల్పడిన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జాతీయ ఎస్టీ కమిషన్కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పరిశీలించినట్లయితే, గోపాల్ ఇంటిలోకి చొరబడి కొంతమంది వ్యక్తులు దారుణంగా దాడి చేశారని, కత్తితో గొంతు కోయడానికి ప్రయత్నించి ఎడమ తొడపై, మెడపై తీవ్ర గాయాలు చేశారని ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. నిందితులను కఠినంగా శిక్షించాల్సిందిగా ఎంపీ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు.

## బడికి రాని పిల్లలు గుర్తింపు

సూళ్లూరుపేట, నవంబర్ 10 ప్రభాతవార్త: మండలంలోని దామానెల్లూరు హైస్కూలు పరిధిలో కొంతమంది విద్యార్థులు స్కూలుకు రాకుండా ఇంటి వద్ద ఉంటూ పనులకు వెళుతుండటాన్ని క్లస్టర్ మానిటరింగ్ రిసోర్స్ టీచర్ అంకయ్య గుర్తించి సోమవారం ఆ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను స్కూలుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. 6వ తరగతి చదువుతున్న లక్కీ, రాజేష్, 7వ తరగతి చదువుతున్న గౌతం, ప్రవీణ్, 8వ తరగతి చదువుతున్న వికాస్లను బడికి తీసుకెళ్లి హైస్కూలు హెడ్మాస్టర్కు అప్పగించారు.

## అమ్మవారి ముఖ ద్వారానికి భూమి పూజ



వెంకటగిరి, నవంబర్ 10 ప్రభాతవార్త : గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి ముఖద్వారం నిర్మాణానికి దాతలు కోన వెంకటేశ్వరరావు, సర్వేపల్లి విజయ్కుమార్లు పట్టణంలోని పాల కేంద్రం కూడలివద్ద భూమిపూజ చేశారు. పోలేరమ్మ ఆర్చి భూమి పూజ సందర్భంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి ద్వారాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచన మేరకు నిర్మిస్తున్నట్లు దాత కోన వెంకటేశ్వరరావు తెలిపారు. రెండు రోజుల్లో పని మొదలుపెట్టి తొందరగా పూర్తి చేయిస్తామని చెప్పారు. మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరుకొండ రామకృష్ణ సొంత నిధులతో క్రాస్ రోడ్ వద్ద ఆర్చ్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్, శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు సభ్యులు కౌసల్యమ్మ, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, అనిల్ కుమార్, రాధమ్మ, సిఐ ఏవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## గోవర్ధన్రెడ్డిని కలిసిన వైసీపీ నాయకులు



కోట, నవంబర్ 10 ప్రభాతవార్త: మాజీమంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డిని హైదరా బాద్లోని ఆయన నివాసంలో వైసీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ప్రసాద్రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంరెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ చేపట్టిన ర్యాలీని అన్ని అనుబంధ విభాగాలు కలిసి విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వంపై పోరాటం చేయాలని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి దిశానిర్దేశం చేశారని సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు.

## యూరియా నిల్వ పుష్కలంగా ఉన్నాయి : ఏడిఏ



బాలాయపల్లి, నవంబర్ 10 ప్రభాతవార్త: యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడిఏ అనసూయ తెలిపారు. మండలంలోని నిడిగల్లు సొసైటీ ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా యూరియా కార్డు ఉంటేనే రైతులకు యూరియా ఇస్తారు అని తెలిపారు. రైతులకు యూరియా కొరతలేదు, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. 20 టన్నుల యూరియాను సొసైటీ ద్వారా రైతులకు ఇచ్చాము అని అధ్యక్షుడు ఆది వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. రైతులు అవసరం మేరకే యూరియాను వాడాలి అనిఏవో విజయలక్ష్మి తెలిపారు.

# గూడూరు డివిజన్

## నేడే పరిశ్రమల శంకుస్థాపన

పెళ్లకూరు నవంబర్ 10 ప్రభాతవార్త: మండలంలోని శిరసనంబేడు మరియు పాలచూరు గ్రామాలలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ) వారి భూములలో నేడు రెండు భారీ పరిశ్రమలు పాలచ్చూరు పంచాయతీలో దమ్ము బయోఫ్యూయెల్ పరిశ్రమ శిరసనంబేడులో ఎంఎస్ఎం ఈ పరిశ్రమకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశ్రమల ఏర్పాటుతో మండలంలోని చాలామంది నిరుద్యోగులకు జీవనోపాధి లభిస్తుందని ఆశపడుతున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ నెల విజయశ్రీ పాల్గొంటారని అధికారులు తెలిపారు.

## చెన్నూరులో సబ్సిడీతో యూరియా పంపిణీ



గూడూరు రూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త: ప్రతి రైతుకు రబీ సీజన్లో యూరియాను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ప్రతి రైతు యూరియాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 24 సొసైటీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, ఏ.ఎం.సి డైరెక్టర్ శ్యామల, ఏ.డి. గోపీనాయక్, అల్లం కృష్ణయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారులను ఆదుకోవాలి



గూడూరు, నవంబర్ 10 ప్రభాతవార్త: డప్పు కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని లేని యెడల భవిష్యత్తులో డప్పు కల పూర్తిగా అంతరించి పోతుందని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం నాయకులు సంక్రాంతి వెంకటయ్య వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం గూడూరు మహాసభ నిర్వహించారు. డప్పు వాయిద్య గొప్పతనాన్ని తెలియజేస్తూ గీతాలను ఆలపించారు. సంఘ నాయకులు సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు ఇప్పుడు సినిమాలు ఆధునిక వాయిద్యాలను ప్రోత్సహిస్తుందని దీంతో డప్పు కల అంతరించిపోయే పరిస్థితి ఎదురవుతుందని అన్నారు.అనంతరం సి.పి.ఎం కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డప్పులు వాయిస్తూ ర్యాలీ చేపట్టి, వినతి పత్రం అందచేశారు. ఈ సమావేశంలో కె.వి.పి.ఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, పుల్లయ్య రఘు, నారాయణ, క్రాంతి, గంగిరెడ్డి, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపీ డప్పు కళాకారుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చనుమూరు క్రాంతి, ఉపాధ్యక్షులు అడపాల ప్రసాద్, బద్దేపూడి కృష్ణా, కార్యదర్శిగా రాగిపాటి నారాయణ, సహాయ కార్యదర్శిగా ఎంబేటి చంద్రయ్య, కనుపూరు ముత్యాలయ్య, ట్రెజరర్ యేకుల రమణయ్య, కమిటీ సభ్యులు 15 మందిని ఎన్నుకున్నారు. అంతరం పలువురు అభినందనలు తెలిపారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, నవంబర్ 10 ప్రభాతవార్త : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నెల్లూరు ఎల్ఐసి నందు ఏఓగా పనిచేయు దుర్గం రవికుమార్ దాతృత్వంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు నిరుపేద గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెంచులక్ష్మి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక వారు గత 12 సంవత్సరముల నుండి భోజనాల పంపిణి కార్యక్రమాన్ని నిరంతరంగా చేయడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన దుర్గం రవికుమార్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా, జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, రామమోహన్, పురుషోత్తమరావు, రజినీకాంత్, ప్రభాకర్, సాయి,సురేష్,ఆర్టిసి గ్యారేజ్ ఇంచార్జ్ తూపిలిరాగయ్య, శర్మలు పాల్గొన్నారు.

## పింఛన్ వెరిఫికేషన్కు వెళ్లి వ్యక్తి అదృశ్యం!



గూడూరు, నవంబర్ 10 ప్రభాతవార్త: మండల పరిధిలోని పాలిచర్ల గ్రామానికి చెందిన ఏలేష (55) పింఛన్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 6వ తేదీన తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్లి అదృశ్యమయ్యాడు. రుయా ఆసుపత్రిలో రోజు మొత్తం పరీక్షల కోసం ఉన్న ఆయనను డాక్టర్లు సిమ్స్ హాస్పిటల్కి వెళ్లాలని సూచించారని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే రాత్రి ఆలస్యం కావడంతో రుయా ఆసుపత్రిలోనే బస చేయగా, రాత్రి 9.30 గంటల సమయంలో ఆసుపత్రి ప్రాంగణం నుండి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏలేష ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. ఏలేష ఆచూకీ తెలిసినవారు 63000 62708, 8500778160 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## కూలికి పిలిచారు...కాటికి పంపారు!

### -చెట్టు మీద నుంచి పడ్డ గిరిజనుడు మృతి



శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 10 ప్రభాతవార్త: నా కొడుకును పనులకు పిలుచుకొని వెళ్ళి, సాయంత్రం చెట్టుమీద నుంచి పడ్డాడు. వైద్యం అందించామంటూ నమ్మబలికి వదలిపెట్టారు. సోమవారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్నాడని సమాచారం ఇస్తే తమకు సంబంధం లేదని చేతులు ఎత్తేశారని తన కుమారుడు మృత్యుపాలయ్యాడని ఆయన నలుగురు బిడ్డలను ఎలా పోషించుకోవాలని ఆ తల్లి రోదన ఆసుపత్రి ఆవరణలో వర్ణనాతీతంగామారింది. శ్రీకాళహస్తి మండలం ముళ్ళపూడి గిరిజన కాలనీకి చెందిన తుపాకుల కన్నయ్య (40)ను నారాయణ పురం గ్రామానికి చెందిన బత్తిరెడ్డి అనే రైతుకు పనికి అంటూ మేస్త్రీ పిలుచుకొని పోయాడనిమృతుని తల్లి నాగభూషణమ్మ ఆసుపత్రి మార్చురీ వద్ద రోదిస్తూ వివరించింది. ఆమె అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముళ్ళపూడి గ్రామానికి చెందిన తుపాకుల కన్నయ్య కూలి నాలి చేసి తనభార్య, నలుగురు పిల్లలతో పాటు తల్లిని పోషిస్తున్నట్లు నాగభూషణమ్మ వివరించింది. ఆదివారం మేస్త్రీ నారాయణ పురం గ్రామంలోని రైతు బత్తిరెడ్డి వద్ద పనికి తీసుకెళ్ళినట్లు వివరించింది. అక్కడ పురాతన కాలం నాటి మర్రిచెట్టును కొట్టే నేపథ్యంలో కన్నయ్య పై నుంచి పడినట్లు తమకు సమాచారం అందిందన్నారు. సాయంత్రం కన్నయ్యను ఆటోలో తెచ్చి దింపారని ఏమైందని ప్రశ్నించగా చెట్టుకొమ్మలు నరుకుతూ జారి పడ్డాడని ఆసుపత్రికి తీసుకెళ్ళి వైద్యం అందించామని ఇంకా ఎక్కడకు తీసుకెళ్ళ వద్దు, పడ్డ మైకంలో ఉన్నాడని చెప్పి తమ చేతిలో రూ.వెయ్యి పెట్టి వెళ్ళారని నాగభూషణమ్మ వివరించింది. సోమవార తెల్లవారు ఉలుకు పలుకు లేకుండా ఉన్న కన్నయ్యకు సంబంధించి సమాచారం ఇవ్వగా తమకు సంబంధం లేదంటూ మేస్త్రీ, రైతు చేతులెత్తేసారని నాగభూషణమ్మ వివరించింది. మరి కన్నయ్య మృతికి కారకులెవరు? అనేది శేష ప్రశ్నగా ఉంది. కుటుంబాన్ని పోషించే కన్నయ్య మృతితో ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. ఇంక ఆదుకునే దిక్కెవరు? ఆదరించే వారెవరన్నది చర్చనీయాంశంగా మారింది.

# డయల్ యువర్ ఏపిఎస్పిడిసిఎల్ సిఎండికి విశేష స్పందన

### -వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం -సిఎండి శివశంకర్ లోతేటి



తిరుపతిరూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారుల సమస్యలను తక్షణమే పరిష్కరి ంచేందుకు 'డయల్ యువర్ ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి' కార్యక్రమానికి వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆ సంస్థ ఛైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సోమవారం తిరుపతిలోని ఏపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి 76 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూల్, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్ మంజూరు, పాఠశాలల ప్రాంగణాలలో వున్న విద్యుత్ లైన్ల మార్పులో జాప్యం, బిల్లుల సవరణ, విద్యుత్ స్తంభాల మార్పిడి, విద్యుత్ లైన్లకు దగ్గరగా చెట్ల కొమ్మలు ఉండటం, డిష్వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా మారడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి అంశాలను ప్రస్తావించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ వినియోగదారులు పేర్కొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. 'సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆయా జిల్లాల ప్రత్యేకాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గురవయ్య, ఆయుబ్ఖాన్, రామ్మోహన్రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు రమణాదేవి, ఆదిశేషయ్య, సురేంద్రనాయుడు, మురళీకుమార్, జనరల్ మేనేజర్లు రామచంద్రరావు, చక్రపాణి, సురేంద్రరావు, ప్రసాద్, వెంకటరాజు, భాస్కర్రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతగా వ్యవసాయ అధికారులు విధులు

### - ఉద్యోగస్తులకు అండగా వుంటా - కలెక్టర్ సుమిత్కుమార్

చిత్తూరు, నవంబర్ 10 ప్రభాతవార్త: వ్యవసాయ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్లో సోమవారం వ్యవసాయశాఖ జెడి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలెక్టర్ సుమిత్ కుమార్ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది స్నేహ పూర్వకమైన వాతావరణంలో పౌరులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. జర్నలిజం పేరిట ఉద్యోగులను బ్లాక్మెయిలింగ్కు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటం, వారిని బ్లాక్మెయిల్ చేయకుండా కార్యాలయంలోని సిబ్బంది నిర్భయంగా పని చేసుకునే వాతావరణం కల్పించడం కలెక్టర్గా తన బాధ్యత అన్నారు. ఈ రోజు కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇద్దరు విలేకరులపై అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేయాల్సిందిగా చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులును ఆదేశించడం జరిగిందన్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్కుమార్ ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ 2వ ఎఎన్ఎంలకు సత్వరం వేతనాలు పెంపు

### - డిఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా

చిత్తూరుహెల్త్, నవంబర్ 10 ప్రభాతవార్త: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఎఎన్ఎంల విధులకు ధీటుగా విధులు నిర్వహిస్తున్న సెకండ్ ఎఎన్ఎంలకు సత్వరం వేతనాలు పెంపుకు చర్యలు తీసుకోవాలని ఏపి గవర్నమెంట్ కాంట్రాక్ట్ సెకండ్ ఎఎన్ఎంల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట సోమవారం సెకండ్ ఎఎన్ఎంల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించిన సెకండ్ ఎఎన్ఎంల యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెకండ్ ఎఎన్ఎంల నుండి అన్ని రకాల పనులు చేయించుకుంటూ వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరలక్ష్మీ, విజయలతో పాటు పెద్ద ఎత్తున సెకండ్ ఎఎన్ఎంలు పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణిని కలిసి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు

చంద్రగిరి, నవంబర్ 10 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుచ్చి వాహన సేవ కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణ హనుమంత స్వాముల వారి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై అధిష్టించి భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఇఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్బాబు, ఆర్జితం ఇన్స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, జమేధార్ శింగారాయ, అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హత్య కేసు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



రేణిగుంట నవంబర్ 10 ప్రభాతవార్త: రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసులు మనోజ్ హత్య కేసును చేదించి నాలుగు రోజుల్లో నిందితులను అదుపులోకి తీసుకొని సోమవారం రిమాండ్కు తరలించి అందరి మన్ననలు పొందారు. గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేశ్వరి నగర్ లక్ష్మీనివాసం చెంచు వైన్స్ పక్కన అసంపూర్తిగా ఉన్న అపార్ట్మెంట్ సంపులో ఈనెల 10వ తేదీ మనోజ్ అనే యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే అప్పటి ఇన్చార్జి సీఐ జయచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ మంజునాథ రెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బందితో మూడు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం వేట ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నిందితులు రేణిగుంట మండలం ఎర్రమరెడ్డి పాలెం నివాసి హరి ప్రసాద్ (46), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం నివాసి సుధాకర్ (46), రేణిగుంట పట్టణం పాంచాలి నగర్కు చెందిన శ్యామ్సన్ (50) లను ఆదివారం ఉదయం కరకంబాడి శ్రీ కట్ట పుట్టాలమ్మ దేవస్థానం వద్ద అదుపులోకి తీసుకొని, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి సమక్షంలో రిమాండ్కు పంపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిఐలు జయచంద్ర, మంజునాథరెడ్డి, ఎస్సై సుధాకర్, ట్రైనీ ఎస్సై ప్రవల్లిక, కానిస్టేబుళ్లు మహేంద్ర,మణి, రాజశేఖర్, బారుషా, గోపి, వాసు, శివకుమార్ లను అభినందిస్తూ వారికి అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి రివార్డులు అందజేశారు.

## భక్తుల కదలికలపై గణాంకాలు రావాలి

### -విజిలెన్స్, వైకుంఠం,ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి -టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి



తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటే శ్వర స్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల కదలికలపై,భక్తుల గణాంకాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి నిర్ణయాలు తీసుకునేలా పనిచేయాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. విజిలెన్స్, వైకుంఠం, ఆలయ సిబ్బంది క్యూలైన్లలో భక్తుల సౌకర్యాలు, రద్దీ తదితర వాటిని నిరంతరం పర్యవేక్షించడం సులభమవుతుందన్నారు. సోమవారం వైకుంఠం క్యూకాంప్లెక్స్ లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ను టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, వింగ్ విఎస్ఓ ఎన్టీవిరామ్ కుమార్, విఎస్ఓ అల్లంసురేంద్ర, ఐటి జిఎం ఫణికుమార్నాయుడు,డిప్యూటీ ఈఓ లోకనాథం తో సమీక్షించారు.

## మెట్లపై మాంసాహారం భోజనం -ఇద్దరు కార్మికులు తొలగింపు

తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల పవిత్రతను కాపాడి భక్తుల మనోభావాలు పరిరక్షించాల్సిన కార్మికులు నిబంధనలు ఉల్లంఘించి ఆదివారం రోజు మాంసాహార భోజనాన్ని అలిపిరి మెట్లమార్గంలో తినడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అలిపిరి మెట్లమార్గంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికు లు సరసమ్మ, రామస్వామిలు మాంసాహార భోజనం తింటుండగా కొందరు భక్తులు సెల్ఫోన్లలో వీడియోలు తీశారు. దీనిపై చర్యలు తీసుకుని విధుల్లోంచి తొలగించామని టిటిడి తెలిపింది.

## ఆత్మహత్యలు చేసుకుంటామని...బెదిరింపులకు గురి చేస్తే కేసుల నమోదు

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరిక

తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 10 ప్రభాతవార్త : బాధితులు ఎవరైనా పెట్రోల్ బాటిల్లతో కలెక్టరేట్కు వచ్చి ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరింపులకు గురి చేస్తే పోలీస్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన స్పందన కార్యక్రమంలో కే వి బి పురం మండలం పనసవారి కండ్రిగ గ్రామానికి చెందిన బాధిత వీరాస్వామి అమరావతి దంపతులు వారి కుమారుడు ప్రేమ్ కుమార్ కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేసేందుకు వచ్చారు. అయితే వీరు పలు పర్యాయాలు కలెక్టరేట్కు వచ్చినా న్యాయం జరగలేదనే బాధతో తిరిగి మరో పర్యాయం 10 వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి తల్లిదండ్రులను కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యలు చేసుకోవాలని ప్రోత్సహించిన కుమారుడు ప్రేమ్కుమార్పై తిరుచానూరు పోలీసులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తూ తిరుపతి జిల్లా కార్యాలయం లోపల బయట పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. బాధితులు ఎవరు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, సున్నితంగా సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ హితవు పలికారు.

## ఆకాశ దీపాన్ని ఆవిష్కరించిన ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి,నవంబర్ 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కోట మండపం వద్ద సోమవారం ఆకాశదీపాన్ని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి ఆవిష్కరించారు. సాయంత్రం కోట మండపం వద్దకు ఆకాశదీపాన్ని నేతితో నింపారు.వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి శాస్త్రోక్తంగా ఆకాశదీపాన్ని ఆవిష్కరణ గావించారు.ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ సభ్యులు విశాలాక్షి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.